పూంఛి కమిషన్ సిఫార్సులు..

సెక్షన్-3, యూనిట్-2

Q హక్కులు, విధులు 'పరస్పర పోషకాలు'- చర్చించండి.

A మన రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రాథమిక హక్కులు, నాలుగు (ఎ)లో విధులు పొందుపరిచారు. మొదట హక్కులు, విధుల నిర్వచనం, ఆ తర్వాత వాటి మధ్య గల సంబంధాన్ని పరిశీలిద్దాం.

రాజ్యనిరపేక్ష అధికారం నుంచి, సమాజంలోని శక్తివంతమైన వ్యవస్థలు, వ్యక్తుల ఆధిపత్యం నుంచి సగటు పౌరుడి స్వేచ్ఛను పరిరక్షించడానికి ఉద్దేశించిన హామీలే హక్కులు. మానవ మనుగడకు ఇవి ఎంతో అవసరం. అందుకే వీటిని ప్రాథమిక హక్కులు అంటారు. 'సామాజిక ఆమోదం పొంది చట్టబద్ధత కలిగి, సమాజంలోని వ్యక్తులందరూ అనుభవించే సదుపాయాలు' హక్కులు. రాజ్యాంగంలోని 12వ ప్రకరణ నుంచి 35 వరకు ప్రాథమిక హక్కులను వివరించారు.

విధి అంటే వ్యక్తి సమాజం పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యత. ప్రాథమిక విధులను 42వ, 86వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా చేర్చడం జరిగింది (1976, 2002). ప్రాథమిక హక్కులు ఆరు రకాలు. అవి.. సమానత్వ హక్కు; స్వాతంత్ర్య హక్కు; పీడనాన్ని నిరోధించే హక్కు; మత స్వాతంత్ర్య హక్కు; విద్య, సాంస్కృతిక విషయాల హక్కు; రాజ్యాంగ పరిహార హక్కు. 14, 20, 21, 23, 25, 27, 28 ప్రకరణల్లో ప్రస్తావించిన హక్కులు భారత రాజ్య భూభాగంలో నివసించే వ్యక్తులందరికీ లభిస్తాయి. 15, 16, 19, 21ఎ, 30 ప్రకరణల్లో ప్రస్తావించిన హక్కులు కేవలం భారత పౌరులకు మాత్రమే లభిస్తాయి. 352వ ప్రకరణ కింద అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు 20, 21 ప్రకరణల్లోని హక్కులు మినహా మిగతా వాటన్నింటినీ తాత్కాలికంగా రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.

హక్కులు, విధులు పరస్పర భంజకాలు అనే దురభిప్రాయం ఉంది. ఎందుకంటే హక్కులు వ్యక్తికి కొన్ని సదుపాయాలు కలిగిస్తే... విధులు వ్యక్తి మీద బాధ్యత అనే పేరుతో కొంత బరువు మోపుతాయి. ప్రయోజనాలను అనుభవించడం, బాధ్యతలను విస్మరించడం మానవ నైజం. అందుకే ప్రతి ఒక్కరు హక్కుల కోసం పోరాడినంతగా విధులు నిర్వర్తించడంలో శ్రద్ధ చూపించరు. సాధ్యమైనంత వరకు వాటిని విస్మరించడానికి ప్రయత్నిస్తారు. వాస్తవానికి ఒక సమాజంలో పౌరులు ఏ మేరకు హక్కులు అనుభవిస్తున్నారనే విషయం... అందులోని పౌరులు తమ బాధ్యతలు నిర్వహించడంలో ఎంత చిత్తశుద్ధి కలిగున్నారనే అంశం మీద ఆధారపడి ఉంటుంది. విధులు లేకుండా హక్కులు లేవు. ఇవి రెండూ ఒక నాణేనికి రెండువైపులు వంటివి. మన రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కు, స్వాతంత్ర్య హక్కు మొదలైనవి అనుభవించడానికి సమాజంలోని వ్యక్తులు సహకరించాలి. అంటే ఒక వ్యక్తి హక్కు అనుభవించడం, దానికి తగిన పరిస్థితులు కల్పించడం అనే బాధ్యత మిగతా వారిపై ఉంది. ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించడం, రాజ్య సమగ్రతను కాపాడటం అందరి బాధ్యత. అప్పుడే మనం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అనే హక్కులను అనుభవించగలం. ఇటీవల చేర్చిన విద్యా హక్కు (21 ఎ) ను బాల బాలికలు అనుభవించడమనేది... తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పిల్లలకు తగిన అవకాశాలను కల్పించడమనే బాధ్యత లేదా విధిపై ఆధారపడి ఉంది. అలాగే మనం నిజాయితీగా పన్నులు చెల్లించినప్పుడే రాజ్యం సంక్షేమ కార్యక్రమాల మీద ధనం వెచ్చించడానికి వీలవుతుంది. దేశాన్ని కాపాడటానికి పౌరులమైన మనమంతా నడుం కట్టడం ఒక విధి. కాగా.. దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించడం ద్వారా స్వతంత్ర దేశ పౌరుడిగా ప్రాథమిక హక్కులన్నిటినీ అనుభవించడానికి మార్గం సుగమం అవుతుంది.



Q రెండో కేంద్ర- రాష్ట్ర సంబంధాల కమిషన్ (పూంఛి కమిషన్) సిఫార్సులను పరిశీలించండి

A ఇటీవల కాలంలో సంభవించిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర - రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2007లో జస్టిస్ మదన్ మోహన్ పూంఛి అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్‌లో ధీరేంద్ర సింగ్, దుగ్గల్, మాధవ మీనన్, విజయ శంకర్ సభ్యులు. ఈ కమిషన్ 2010 మార్చిలో తన నివేదికను సమర్పించింది. సుదీర్ఘమైన ఈ నివేదికలో ఏడు సంపుటాలున్నాయి. ఈ ఏడు సంపుటాల్లో ఒక్కో దానిలో ఒక్కో అంశాన్ని విశ్లేషించారు. అవి..

మొదటిది: కేంద్ర - రాష్ట్ర సంబంధాల పరిణామాన్ని విశ్లేషించింది.

రెండోది: రాజ్యాంగ ప్రకరణలు 19, 355, 356, 263 పనితీరును అధ్యయనం చేసి సిఫార్సులు చేసింది.

మూడోది: ఆర్థిక సంబంధాలను విశ్లేషించింది.

నాలుగోది: 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాలకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసింది.

ఐదోది: అంతర్గత భద్రతాంశాలను విశ్లేషించి దానిలో భాగంగా ఉగ్రవాదం, నక్సలిజం, చొరబాటుతనం, మతపరమైన అల్లర్లు తదితరాల నియంత్రణకు కొన్ని సూచనలు చేసింది.

ఆరోది: పర్యావరణం, నదీ జలాలు, ఖనిజాలు వంటి వనరుల వాటా తదితర అంశాలపై సిఫార్సులు చేసింది.

ఏడోది: సామాజిక ప్రగతి, సుపరిపాలనకు సంబంధించిన అంశాలపై సిఫార్సులు చేసింది.

ముఖ్య సిఫార్సులు:

- ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంటు చట్టం ఆమోదించే ముందు రాష్ట్రాలను సంప్రదించాలి.
- రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు చేసే ముందు ఆచి,తూచి వ్యవహరించాలి.
- ఉమ్మడి జాబితాలోని అంశాలకు సంబంధించిన చట్టాల అమల్లో అంతర్‌రాష్ట్రీయ మండలిని సంప్రదించడం సబబు.
- తన ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను రాష్ట్రపతి ఆరు నెలల్లో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవడం మంచిది
- అంతర్జాతీయ ఒప్పందాల అమలుకు అవసరమైన చట్టాలు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉంది. అయితే ఈ ఒప్పందాలు అనేక సందర్భాల్లో రాష్ట్ర ప్రయోజనాలను ప్రభావితం చేస్తాయి. కనుక అలాంటి ఒప్పందాలను ఖరారు చేసేటప్పుడు పార్లమెంటు, సంబంధిత రాష్ట్రాలను భాగస్వాములను చేయడం మంచిది.
- గవర్నర్ల నియామకం, తొలగింపు ప్రక్రియకు సంబంధించి ఎని మిదో దశకంలో సర్కారియా కమిషన్ చేసిన సిఫార్సులను పాటించడం అవసరం. రాష్ట్ర గవర్నర్‌ను మహాభియోగ తీర్మానం ద్వారా తొలగించే అధికారం సంబంధిత రాష్ట్ర శాసన సభకు కట్టబెట్టాలి. గవర్నరుకున్న విచక్షణాధికారాలను (163 (2)) పరిమితం చేయాలి. తన అనుమతి కోసం పంపిన బిల్లులపై గవర్నర్ ఆరు నెలల్లో నిర్ణయం తీసుకోవాలి.
- రాష్ట్రాలను విదేశీ దురాక్రమణల నుంచి, అంతర్గత అలజడుల నుంచి కాపాడాల్సిన బాధ్యత(355 ప్రకరణ) కేంద్ర ప్రభుత్వానిది. ఆ సందర్భంగా సాయుధ బలగాలను రాష్ట్ర ప్రభుత్వాలకు పంపేటప్పుడు సంబంధిత ప్రభుత్వాన్ని సంప్రదించాలి.
- అనివార్య పరిస్థితుల్లో మాత్రమే 356 ప్రకరణను వినియోగించాలి. బొమ్మై కేసు (1994)లో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- 355, 356 ప్రకరణల కింద స్థానిక అత్యవసర పరిస్థితి (లోకలైజ్డ్ ఎమర్జెన్సీ) ప్రకటించడం మంచిది. రాష్ట్రం మొత్తాన్ని రాష్ట్రపతి పాలనకు గురి చేయడం కంటే, ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న ప్రాంతంలో మాత్రమే పై ప్రకరణలను అమలు చేయాలి.
- కేంద్ర-రాష్ట్రాల మధ్య సమన్వయం సాధించడానికి అంతర్ రాష్ట్రీయ మండలిని మరింత బలపరచి విస్తృతంగా ఉపయోగించాలి.
- ప్రాంతీయ మండళ్లను (జోనల్ కౌన్సిల్స్), ముఖ్యమంత్రుల సమావేశాలకు విస్తృతంగా ఉపయోగించుకోవడం ద్వారా కేంద్రం-రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగుపరచవచ్చు.
- మరిన్ని అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేయాలి. వాటి సేవలను స్థానిక ప్రభుత్వాలకు కూడా అందుబాటులో ఉంచాలి.
- రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యసభను రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో మరింత విస్తృతంగా వినియోగించుకోవాలి. రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు రాజ్యసభ సభ్యులతో కూడిన కమిటీ పరిశీలించడం మంచిది.
- రాజ్యసభలో అని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి (అమెరికాలోని సెనేట్ మాదిరిగా).
- స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలను బదిలీ చేయాలి. లేకుంటే వాటికి రాజ్యాంగబద్ధత కల్పించడం వల్ల ప్రయోజనం ఉండదు.
- పార్లమెంటు చేసిన చట్టాలను అమలు చేయడానికి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలి.
- ఆర్థిక సంఘాన్ని శాశ్వత ప్రాతిపదికగా ఏర్పాటు చేయాలి.
- అంతర్ రాష్ట్రీయ మండలిని కేంద్ర-రాష్ట్ర వివాదాలను, వివిధ రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి ఉపయోగించాలి. ఇందుకోసం ఈ మండలిని మరింత పటిష్టం చేయాలి.

Q 13వ ఆర్థిక సంఘం సిఫార్సులను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

A ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి లేదా అంతకంటే ముందు ఆర్థిక సంఘాన్ని 280వ రాజ్యాంగ ప్రకరణ కింద రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు.

కమిషన్ ముఖ్య విధి: కేంద్ర ప్రభుత్వ పన్నుల ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజనకు సిఫార్సు చేయడం. 13వ ఆర్థిక సంఘం తన నివేదికను ఫిబ్రవరి, 2010లో సమర్పించింది.

ఆర్థిక సంఘ విచారణ నిబంధనలు (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) ఇటీవల కాలంలో విస్తృతమవుతున్నాయి. కేంద్ర-రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతలను తగ్గించడానికి తగిన సూచనలను చేయడంతోపాటు, స్థూల ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి సంబంధించిన అంశాలు, కేంద్ర, రాష్ట్రాల్లో విత్త పునర్నిర్మాణానికి సంబంధించిన విషయాలు దీని పరిధిలోకి వస్తున్నాయి. 13వ ఆర్థిక సంఘం పైన ప్రస్తావించిన అంశాలతోపాటు, ప్రభుత్వ ఖర్చులకు తగిన ప్రతిఫలం రాబట్టడానికి సూచనలు, వాతావరణ మార్పులు, పరిసరాల పరిరక్షణ, వస్తువులు, సేవల పన్ను ప్రభావం (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్) కేంద్ర, రాష్ట్రాల మీద ఏ మేరకు ఉంటుంది- మొదలైన అంశాలు పరిశీలించింది.

ముఖ్య సిఫార్సులు:

- కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో రాష్ట్రాల వాటా శాతం 30.5 నుంచి 32 కి పెంచడం.
- వస్తువులు, సేవల మీద పన్ను విధాన రూపకల్పన.
- విత్త ఏకీకరణకు (ఫిస్కల్ కన్సాలిడేషన్) సవరించిన పథకం.

- స్థానిక ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో 2.28 శాతం వాటా.
- వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ ఖర్చుకు తగిన ప్రతిఫలం రాబట్టడం తదితర అంశాలకు సంబంధించి సూచనలు.

ఆర్థిక సంఘ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుచేస్తే అనేక సత్ఫలితాలనిస్తాయి. విత్త ఏకీకరణ సాధించడానికి ఇది సూచించిన మార్గదర్శకాలలో ముఖ్యమైనవి.

- 2014-2015 సంవత్సరానికి కేంద్రంలో రెవెన్యూ లోటును తొలగించడం.
- స్థానిక ప్రభుత్వాలకు నిర్ధిష్ట పరిమాణంలో కేంద్రం నుంచి వనరుల బదిలీ.
- వస్తువులు, సేవా పన్ను విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల రాష్ట్రాలు ప్రారంభ దశలో కొంత నష్ట పోయే అవకాశం ఉంది. అందువల్ల ఆ మేరకు నష్ట పరిహారంగా ₹ 50,000 కోట్ల ధన సహాయం.
- కేంద్ర ప్రభుత్వం ప్రారంభించే పథకాలను క్రమేణా తగ్గించడం.
- రాష్ట్రాలు విద్యుత్ శక్తి సరఫరాలో ఎదుర్కొంటున్న నష్టాలను నిర్ణీత కాలంలో తగ్గించడం.
- విపత్తు నివారణకు, ప్రాథమిక విద్య, పర్యావరణ పరిరక్షణ, రోడ్లు, వంతెనల నిర్మాణం, రాష్ట్రాల ప్రత్యేక అవసరాలకు నిధులు.

అయితే.. ప్రత్యేక కార్యక్రమాల అమలుకు అందించే ధన సహాయం షరతులతో కూడి ఉండటం రాష్ట్రాల ఆర్థిక స్వాధీనతను మరింత బలహీన పరుస్తోంది. అలాగే అన్ని రాష్ట్రాలు 2014-15 సంవత్సరానికి తమ విత్తలోటును స్థూల జాతీయోత్పత్తిలో మూడు శాతం తగ్గించాలనడం ఆచరణాత్మకం కాదు. అంతేకాక అన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఒకేలా ఉండదు. వస్తువులు, సేవల పన్నుల అమలుతో రాష్ట్రాలు తాత్కాలికంగా నష్టపోతాయి. వాటికి ఇచ్చే నష్ట పరిహారం ఒకే మోతాదులో ఇవ్వడం అశాస్త్రీయం.